




త్యాగాలు మా నేతలకు కొత్త కాదు..!

మీడియా సమావేశంలో చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-కొడవలూరు

'రాష్ట్రం కోసం, పార్టీ కోసం త్యాగాలు చేయడం మా నేతలకు కొత్తేమి కాదు. అవసరాన్ని బట్టి పదవులు త్యాగాలు చేస్తారు " అని టిడిపి అధినేత ఎన్. చంద్రబాబునాయుడు అన్నారు. మూడు రోజులు నెల్లూరు జిల్లాలో నిర్వహించిన "ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం శనివారం ముగిసింది. ఈసందర్భంగా కొడవలూరు మండలం, రాజుపాళెంలో ఆయన మీడియాలో మాట్లాడారు. చంద్రబాబు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలని, మంచివారు వస్తే పార్టీలోకి ఆహ్వానిస్తామన్నారు. ఎపి జెన్కోను ప్రయివేటీకరించడం అన్యాయమన్నారు. లోకేష్ పాదయాత్ర కొనసాగుతుందని, ఎవరో బెదిరిస్తే ఆగదన్నారు. సమావేశంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డిచంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, పాశం సునీల్‌కుమార్, కురుగుండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

పింఛన్.. టెన్షన్..తప్పిందా..!

పింఛన్ దారులకు నోటీసులు జారీ చేసి,ఎక్కువ మందిని పింఛన్ కట్‌చేస్తున్నారని ఆందోళన చెందిన లబ్ధిదారులకు కాస్త ఊరట లభించింది. అధికార, ప్రతిపక్షపార్టీలు ఆందోళన నిర్వహించడంతో ప్రభుత్వం దిగొచ్చింది. గత నెలలో . జిల్లా వ్యాపితంగా 11,987 మందికి నోటీసులు జారీ చేశారు. వెరిఫికేషన్ చేయడంతో 7,543 మంది అర్హులుగా గుర్తించారు. 2,355 మందిని అనర్హులుగా గుర్తించారు. 1968 మంది ధరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. నెల్లూరు కార్పొరేషన్‌లో 4,671 మందికి నోటీసులు ఇచ్చారు. అందులో రీ వెరిఫికేషన్‌లో 2493 మంది అర్హులుగా గుర్తించారు. 2127 మంది అనర్హులుగా తేలింది. జిల్లా వ్యాపితంగా 38 మండలాల్లో సుమారు 3.04 లక్షల మందికి ప్రతి నెలలో రూ 77.12 కోట్లు పంపిణీ చేశారు. ఈనెల నుంచి రూ.2750 పింఛన్ అందజేయనున్నారు. నేడు జిల్లాలోని అర్హులందరికి పింఛన్ అందజేయనున్నట్లు డిఆర్‌డిఎ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. అనర్హులు, పెండింగ్‌లోఉన్న వారికి ఇవ్వలేమని, వెరిఫికేషన్‌లో ఒకే అయితే వెంటనే ఇస్తామని తెలిపారు.

- ❍11,987 మందికి నోటీసులు..
- ❍7,543 మంది అర్హులు
- ❍2,355 మందికి పింఛన్ కట్
- ❍నగరంలో 2,127 మంది అవుట్
- ❍నేటి నుంచి పెంచినవి అందజేత

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వ నిబంధనలతో పింఛన్ విషయంలో నోటీసులు అందుకున్న లబ్ధిదారులకు కొంత ఊరట లభించింది. టిడిపి, సిపిఎం లతోపాటు, ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కలెక్టర్ ఆదేశాలతో డిఆర్‌డిఎ అధికారులు మళ్లీ రీవెరిఫికేషన్ నిర్వహించారు. దీంతో కొందరికి పింఛన్ కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాపితంగా 3,04,272 పింఛన్లు ఉన్నాయి. అందు కోసం ప్రతి నెల రూ 77.72 కోట్లు ఖర్చుచేస్తున్నారు. ప్రధానంగా వృద్ధుల పింఛన్ 1,72,829, వితంతువుల 64,977, వికలాంగులు 30,896, ఒంటరి మహిళ 10,964, తోపాటు చేనేత, మత్స్యకారులు, ట్రాన్‌జండర్, డప్పు కళాకారులు, అభయహస్తం, తదితరులున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం గత నెలలో జిల్లా వ్యాపితంగా 11,987 మందికి నోటీసులు జారీ చేశారు. ఈ విషయంలో అధికార, ప్రతిపక్ష నేతల నుంచి విమర్శలు రావడంతో కలెక్టర్ జోక్యం చేసుకున్నారు. డిఆర్‌డిఎ అధికారులకు రీ వెరిఫికేషన్ చేయాలని ఆదేశాలిచ్చారు. డిఆర్‌డిఎ పీడీ సాంబశివారెడ్డి రీ వెరిఫికేషన్ చేయించారు. దీంతో 7,543 మంది అర్హులుగా తెలింది. 2355 మంది రికార్డులు సరిగా లేకపోవడంతో అనర్హులుగా నిర్ధారించారు. 1968 మంది ధరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 4671 మందికి నోటీసులు జారీ చేయగా, రీ వెరిఫికేషన్‌లో 2493 మంది అర్హులుగా తేలింది. 2127 మంది అర్హులుగా సిబ్బంది గుర్తించారు. వీరి రికార్డులు సరిగాలేకపోవడంతో పక్కనపెట్టారు. అర్హులైన వారందరికీ నేడు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఒక్కరోజులోనే అందరికీ ఇవ్వడానికి డిఆర్‌డిఎ అధికారులు సర్వం సిద్ధం చేశారు. గత నెల వరకు ఒక్కో పింఛన్ దారులకు ప్రభుత్వం రూ. 2500 పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల నుంచి మరో రూ. 250 పెంచి, మొత్తం రూ.2750 ఇవ్వనున్నారు. అందుకోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జిల్లాకు రూ.87,28 కోట్లు మంజూరుచేసింది. గ్రామాలు, పట్టణాలకు వాలంటీర్లకు ఈ మొత్తం అధికారులు చేర్చారు. నూతన సంవత్సరం కావడంతో లబ్ది దారులకు సకాలంలో పింఛన్ అందించి చాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అనర్హులు, పెండింగ్‌లో సుమారు 4,323 మంది నేడు పింఛన్‌కు దూరం కానున్నారు. వీరు తమ అర్హతను నిరూపించుకుంటే వెంటనే పింఛన్ ఇవ్వడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. నిబంధనలకు అనుకూలంగా లబ్ధిదారులు రికార్డులు సరిచేసుకోవాల్సి ఉంటుంది. ఇవి కాకుండా కొత్తగా 12,033 పింఛన్లు మంజూరు చేశారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం



నేడు పింఛన్ పంపిణీ చేయడానికి సర్వం సిద్ధం చేశాం. పెంచిన పింఛన్‌తో కలిపి ఉదయం నుంచి వాలంటీర్లు ఇంటింటికి అందజేస్తారు. గతంలో నోటీసులు జారీ చేసిన వారికి రీవెరిఫికేషన్ చేశాం. అందులో 7543 మంది అర్హత సాధించారు. వారందరికి ఇస్తున్నాం. జిల్లా వ్యాపితంగా కేవలం 2355 మంది రికార్డులు సరిగా లేవు. మరో 1968 ధరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం అర్హులందరికి పింఛన్ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికీ అర్హులు తమ రికార్డులు స్థానికంగా చూపిస్తే, వెంటనే పింఛన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పుడు ఆగినా వారికి రాదని, కాదు, రికార్డులు మార్పు చేసుకుంటే ఇస్తాం,. **సాంబశివారెడ్డి- పీడీ, డిఆర్‌డిఎ**

కొనసాగిన డ్రైవర్ల సమ్మె

ప్రజాశక్తి-నెల్లూరు :నగరపాలక సంస్థలో పనిచేయుచున్న చెత్త వాహనాల డ్రైవర్ల అపరిష్కృత సమస్యలను పరిష్కరిం చాలంటూ నిర్వహిస్తేన్న సమ్మె శనివారం 3వ రోజు యథాతథంగా కొనసాగింది. కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చెత్తవాహనాల డ్రైవర్లు బైఠాయించి అధికారులకు తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నెల్లూరు జిల్లా కార్యదర్శి కే పెంచల నరసయ్య మాట్లాడుతూ నగరపాలక సంస్థలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ వాహనాల కాంట్రాక్టర్ గా ఉన్న రెడ్డి ఏజెన్సీస్ కార్మిక చట్టాలను అమలు చేయడం లేదని అన్నారు. నగరపాలక సంస్థలో డ్రైవర్లకు రూ.18,500/- లు జీతం ఇస్తుంటే రెడ్డి ఏజెన్సీస్ 8250 రూపాయలు మాత్రమే జీతం ఇస్తున్నదన్నారు. ఈ వేతనం కూడా గత 5 నెలల నుంచి బకాయిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు కార్యదర్శులు పవన్,వెంకటేశ్వర్లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు కార్మికులు పాల్గొన్నారు.



భూ రీ సర్వే ప్రక్రియ వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు

వై.ఎస్.ఆర్ జగనన్న భూ హక్కు - భూ రక్ష పథకంలో భాగంగా జిల్లాలో జరుగుతోన్న భూ రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు, అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్ లో వైఎస్ఆర్ జగనన్న భూ హక్కు , భూ రక్షా పథకం అమలులో భాగంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియ పురోగతి, జిల్లాలో పెండింగ్‌లోని భూసేకరణ అంశాలపై జాయింట్ కలెక్టర్ కూర్మానాథ్ తో కలసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సుమారు వంద సంవత్సరాల తరువాత రీ సర్వే కార్యక్రమం జరుగుతున్నందున ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రీ సర్వే ప్రక్రియ పటిష్టంగా చేపట్టడంతో పాటు రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు హనుమాన్ ప్రసాద్, కలెక్టరేట్ భూ సేకరణ విభాగం సిబ్బంది ఉన్నారు.

ప్రజలను చైతన్యపరచడంలో

కళాకారుల పాత్ర కీలకం

-ఘనంగా ప్రజానాట్య మండలి 12వ జిల్లా మహాసభలు

-అధ్యక్ష, కార్యదర్శులు వేణు, శేషయ్య

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజలను చైతన్యవంతం చేయడంలో కళాకారుల కీలక పాత్ర పోషిస్తారని పలువురు వక్తలు పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గం పరిధిలోని సుందరయ్య నగర్ , జక్కావెంకయ్య ప్రాంగణంలో ప్రజానాట్య మండలి జిల్లా 12వ మహాస భలు శనివారం నిర్వహించారు. ఈ మహాసభల ప్రారంభోత్స వాన్ని పురస్కరిం చుకొని ప్రజానాట్యమండలి జెండాను జిల్లా అధ్యక్షులు సిహెచ్ రత్తయ్య ఆవిష్కరించారు. అనంతరం ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, ప్రముఖ టీవి ఆర్టిస్టు మురళి, పలువురు ప్రజానాట్యమండలి నాయకులు మాట్లాడారు. కళాకారులు తమ కళా ప్రదర్శనతో ప్రజలను చైతన్య పరచడంలో కీలక భూమికన పోషిస్తారన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో, సమాజంలో చోటు చేసుకుంటున్న కొన్ని ఘటలను కళాకారులు తమ ప్రదర్శనతో ప్రజల కళ్లకు కట్టినట్లు ప్రదర్శనలు ఇస్తుంటా రన్నారు. కళాకారుల సమస్యలను పరిష్కరిం చడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభల్లో ప్రజా నాట్యమండలి కార్యదర్శి పి.విజయ్‌కుమార్ ప్రవేశపెట్టిన నివేదికను హాజరైన ప్రతినిధి వర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలియజేసింది.



మాట్లాడుతున్న నాయకులు

17 మంది నూతన కమిటీ

అనంతరం నూతన కమిటీని 17 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ప్రకటించారు. ప్రజానాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులుగా పరిసిబోయిన వేణు, గండవరపు శేషయ్యలను మహాసభలకు హాజరైన ప్రతినిధి వర్గం ఎంపిక చేసింది. ప్రజా నాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులుగా పి. విజయకుమార్,సిహెచ్. రత్తయ్య, పి.సూర్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శిలుగా,వి. శ్రీనివాసులు వి.నరసయ్య లను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు జిల్లా కమిటీ సభ్యులు గా ఎస్.కె.షకుర్. కె.శ్రీనివాసులు. పి.కొండమ్మ, జె.కన్నయ్య,ె క.పెంచల్, ఎన్.గంగాధర్, ఓ.వెంకటకష్ణ య్య. పి.జయరామయ్య, టి.వెంకయ్యలను ఎన్నుకున్నారు.



పరిసిబోయిన వేణు,(అధ్యక్షులు) గండవరపు శేషయ్య (కార్యదర్శి)

ప్రజాశక్తి డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి 2023 డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి -నెల్లూరు : ప్రజాశక్తి 2023 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. శనివారం రాత్రి కలెక్టర్ చక్రధర్‌బాబు తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాశక్తి డైరీని ఆవిష్కరించారు. డైరీ బాగుందని, ఉపయోగకరంగా ఉందన్నారు. ప్రజాశక్తి యాజమాన్యాన్ని, సిబ్బందిని అభినందించారు. క్యాలెండర్‌ను జాయింట్ కలెక్టర్ కూర్మానాథ్ తన క్యాంప్ కార్యాల యంలో ఆవిష్కరించారు. ప్రజాశక్తి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో మేనేజర్ కె కోటేశ్వరరావు, డెస్క్ ఇన్‌ఛార్జి యు వి రమణయ్య, స్టాఫర్ పి బాలకృష్ణ, ప్రజాశక్తి సిబ్బంది ఎ శ్రీనివాసులు, కరుణాకర్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి కూర్మానాథ్

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి -ఉలవపాడు :నెల్లూరు జిల్లా పర్యటన ముగించుకొని కొండపి నియోజకవర్గానికి వెళ్తున్న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు జాతీయ రహదారిపై ఉలవపాడు మండలం మన్నేటికోట అడ్డ రోడ్డు వద్ద మధ్యాహ్నం కొద్దిసేపు ఆగారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబుకి హారతులతో ఘనస్వాగతం పలికారు. మన్నేటికోటకు చెందిన అమ్మనబ్రోలు శ్రీను ఆధ్వర్యంలో 20 మంది యువకులు, చంద్రబాబు నాయుడు సమక్షంలో వైసిపి వీడి టిడిపిలో చేరారు. చంద్రబాబు నాయుడు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యువకులంతా కష్టపడి పార్టీ కోసం పని చేయాలని, రాబోయే ఎన్నికల్లో కందుకూరులో పార్టీ జెండా ఎగిరేలా కషి చేయాలని వారికి సూచించారు.కందుకూరు నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు యువకులందరిని చంద్రబాబుకు పరిచయం చేశారు.

ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి -పొదలకూరు : మాతభూమిని, మాతభాషను గౌరవించాల్సిందేనని.. అదేవిధంగా సమాజంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే ఆంగ్ల భాష నేర్చుకోవా ల్సిందేనని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు పట్టణంలోని డిఎస్‌ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 620 మంది విద్యార్థులకు రూ. 2 కోట్ల విలువైన ట్యాబ్‌లను ఆయన పంపిణీ చేశారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆటో కార్మిక సంఘం



ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. శనివారం తోటపల్లిగూడూరు మండలం నరుకూరు సెంటర్ లో ఆటో యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. స్టాండ్ అధ్యక్షులు నాసిన పరశురామయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాజా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రవాణా రంగ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదన్నారు.సిపిఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య, ఆటో యూనియన్ సహాయ కార్యదర్శి ఎ. గోపి ఉపాధ్యక్షులు కుమారి వెంకటేషయ్య, ట్రెజరర్ ఎన్. శివ, కె. మల్లి, దయాకర్, గణేశ్ , మనోహర్, బాషా తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరు చంద్రబాబు సభలో ప్రమాదానికి గురై మతి చెందిన గడ్డం మధుబాబు, కాకుమాని రాజా, కలవకూరి యానాది, ఉచ్చులూరు పురుషోత్తం, మర్లపాటి చిన్న కొండయ్య, యాకసిరి విజయ, దేవినేని రవీంద్రబాబు, ఈదుమూడి రాజేశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం మాజీ జెడ్‌పిటిసి, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చింతల శ్రీనివాస్ శనివారం ఆయా కుటుంబాలకు రూ. 40 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం, ఏలూరు పార్లమెంటు కార్యదర్శి సిరిబత్తుల కష్ణమోహన్, కరణం చంద్రకుమార్, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, కందుకూరు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు నియోజకవర్గం తెలుగురైతు అధ్యక్షులు నాదెళ్ల వెంకట సుబ్బారావు, రాళ్లపాడు ప్రాజెక్టు మాజీ చైర్మన్ బొబ్బూరి నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.

యూరియా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి

ఎపి రైతు, కౌలు రైతు, వ్య.కా.స డిమాండ్ - 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు

వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా రైతాంగానికి సరపడా యూరియాను ఆర్‌బికెలకు అలాట్ చేసి బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని ఎపి రైతు, కౌలు రైతు, వ్య.కా. సంఘం జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. శనివారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లోని ఎపి రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు మాట్లాడుతూ జిల్లాలో నవంబరు చివరి నాటి నుంచి రైతాంగం వరినాట్లు వేస్తున్నారని, పంటకు అవసరమైన యూరియాను జిల్లా అధికార యంత్రాంగం రైతాంగానికి సమకూర్చుతామని వాగ్దానం చేసిందన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బికె కేంద్రాల ద్వారా రైతాంగానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా యూరియాను సరఫరా చేస్తుమని చెప్పారన్నారు. ప్రాథమిక దశలోనే రైతాంగానికి కావాల్సినంత యూరియా దొరకడం లేదన్నారు. వాస్తవంగా కృత్రిమ కొరత సృష్టించినట్లు అనుమానం కలుగుందన్నారు. బ్లాక్ మార్కెట్‌లో రూ.40ల నుంచి రూ.70ల ఎక్కువ ధరకు యూరియా దొరుకుతుందని, ఆర్‌బికేలో మాత్రం యూరియా దొరకడం లేదన్నారు. రైతాంగం ఇప్పటికే చాలా ఇబ్బందులకు గురౌతున్నారు. రానున్న రోజుల్లో యూరియా కొరత అధికమైయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యావసాయ అధికారులు యూరియాను ఆర్‌బికెలకు కేటాయించకుండా ప్రయివేట్ వ్యాపారస్తులకు దొడ్డిదారిన సమకూర్చుతున్నారన్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి రైతాంగానికి సరపడా యూరియాను ఆర్‌బికె కేంద్రాల ద్వారా సరఫరా చేసుందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్ మాట్లాడుతూ మాండుస్ తుపాన్ కారణంగా రైతులు వరినాట్లు పూర్తిగా నీటిలో నిండిపోయి పంట అంతా నాశనమైపోయిందన్నారు. రైతులు అష్టకష్టాలు పడి తిరిగిమరలా వరినాట్లు మరలా వేశారన్నారు. ప్రస్తుతం పంటను కాపాడుకొనేందుకు యూరియా అవసరమని,ఎకరాకు రెండు యూరియా బస్తాలు అవసరం అవుతాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని రైతాంగానికి సరపడా యూరియా బస్తాలను ఆర్‌బికె కేంద్రాల ద్వారా సరఫరా చేయాలని కోరారు.కౌలు రైతులను గుర్తించి సిసిఆర్‌సి కార్డులు పంపిణీ చేసి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీని కౌలు రైతులకు అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జనవరి 2వ తేదీన కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతాంగ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో నాయకులు ఆలూరు తిరుపాల్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నాయకులు

చంద్రబాబుకు 23 రావు..!

-పార్టీలో ఎవరి అభిప్రాయాలు వారివి ..
-టిడిపి సభలు ప్లాప్
-మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

చంద్రబాబునాయుడుకు 2024 ఎన్నికల్లో గత ఎన్నికల్లో వచ్చిన 23 కూడా రావని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుస్తుందని చంద్రబాబునాయుడు కలలు కంటున్నారని, అవేవి జరగవన్నారు. ప్రజలు గతంలో ఇచ్చిన సీట్లు కూడా వచ్చే పరిస్థితుల్లోలేరన్నారు. కందుకూరులో జరిగే సంఘటనకు ఆయనే బాధ్యుడన్నారు. జగన్ గతంలో నిర్వహించిన సభలు, రోడ్‌షోలు విశాలమైన ప్రాంతాల్లో నిర్వహించామని, ఇరుకు సందుల్లో కాదనన్నారు. విశ్వసనీయత, కనీస విలువలు లేని చంద్రబాబు నేడు పబ్లిసిటీ స్టంట్ కారణంగా కందుకూరులో ఎనిమిది మంది నిండు ప్రాణాలను కోల్పోయారన్నారు. పార్టీలో ఎవరి అభిప్రాయాలు వారికి ఉన్నాయని, వాటిని గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఆనం రామనారాయణరెడ్డి వ్యాఖ్యలు గురించి ప్రస్తావించారు. ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఏమి చేశాడో చెబుతారని అనుకున్నా..కానీ ఇందుకు భిన్నంగా సాగింది అధికారంలో ఉన్నప్పుడు టిడిపి చేసిన తప్పిదాలు, పాపాలను మేము మోస్తున్నామన్నారు. మేనిఫెస్టో ఇచ్చిన ప్రతి హామీలు నెరవేర్చానని చంద్రబాబు ధైర్యంగా చెప్ప గలవా అని ప్రశ్నించారు. మేనిఫెస్టోను సిఎం వైఎస్ జగన్ భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి అందులోని అంశాలను చిత్తశుద్ధితో పూర్తి చేశారన్నారు. జనాలను చూపించేందుకు ఇరుకు సందుల్లో సమావేశం పెట్టారని బి.బి.సి.లో చెప్పారని, దగదర్తి విమానాశ్రయం కోసం ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేశారని .. తర్వాత మర్చిపోయి. ఇప్పుడు మళ్లీ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు.



నూతన సంవత్సర వేడుకలు

పొదలకూరు : డిఎస్‌ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం చిన్నారుల సమక్షంలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ముందస్తు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. పొదలకూరు మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్ ల పంపిణీలో భాగంగా విచ్చేసిన ఆయన విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

'అమరావతి' స్కూల్లో...

పట్టణంలోని అమరావతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కె.సురేష్ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం అందరికీ క్యాలెండర్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :ఈ నూతన సంవత్సరం ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఎంపిపి ఉప్పల స్వర్ణలత ఆకాంక్షించారు.నెల్లూరు జిల్లా శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఎంపిపి ఉప్పల స్వర్ణలత ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎపిజిఇఎ ఇందుకూరుపేట తాలూకా యూనిట్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులతో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇఒపిఆర్‌డి నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి స్వర్ణలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.


పొదలకూరు : ఎంఇఒ సుధీర్ బాబు శనివారం ఎపిటిఎఫ్ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ పొదల కూరు మండల అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు కొమ్మి లక్ష్మీనారాయణ, మాల్యాద్రి రెడ్డి, కాంతారావు ఉన్నారు.

'మాలకొండ'లో తగ్గిన యాత్రికుల రాక

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో శనివారం భక్తుల సందడి నామమాత్రంగానే ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. ఏడాది చివరి శనివారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో వస్తారనే భావనతో అన్ని ర్పాట్లు ఆలయ అధికారులు చేశారు. ఫలితం లేకుండా పోయింది. వ్యాపారులు సైతం భక్తులు వస్తారని భావించి అవసరమైన వస్తువులను అధికసంఖ్యలో తెచ్చి పెట్టుకున్నారు. ఆశించిన స్థాయిలో జనం రాకపోవడంతో నిరుత్సాహపడ్డారు. ఆలయ ఆదాయంలో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు. మొత్తంగా రూ. 6,46,221 లక్షలు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి కెబి శ్రీనివాసరావు తెలిపారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు : మానగుంట

ప్రజాశక్తి -కందుకూరు



కందుకూరు నియోజకవర్గం ప్రజలకు ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. 2023లో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో జీవించాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరం ఆదివారం రోజున కందుకూరు వైసిపి కార్యాలయంలో ఎంఎల్‌ఎ అందుబాటులో ఉంటారని కార్యాలయ నిర్వాహకులు తెలిపారు.

నిర్మాణ పనులు వేగవంతం

నెల్లూరు :నవరత్నాలు పథకంలో భాగంగా పేదలందరికీ శాశ్వత గృహ వసతి కల్పించే దిశగా రూపొందిస్తున్న జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా వెంకటేశ్వర పురంలోని జగనన్న కాలనీ లే అవుట్ ను అధికారులతో కలిసి కమిషనర్ శనివారం పరిశీలించారు. నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

'ఇంటూరి' ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : ఈనెల 28న టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా జరిగిన దుర్ఘటనలో ఉలవపాడు మండలం, కరేడు పంచాయితీలోని బట్టిసోమయ్య పాలెం గ్రామానికి చెందిన ప్రళయకావేరి గోపాల్ తీవ్రంగా గాయపడి కందుకూరులోని కోటారెడ్డి నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్నాడు. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు దివి శివరాం ఆస్పత్రికి వెళ్లి గోపాల్‌ను పరామర్శించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఇంటూరి నాగేశ్వరరావు హామీ ఇస్తూ, వైద్య ఖర్చుల కోసం లక్ష రూపాయల నగదును బాధితుడికి అందజేశారు. డాక్టర్లతో మాట్లాడి గోపాల్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.


'ఆక్స్‌ఫర్డ్'లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరులోని బిఆర్ ఆక్స్ ఫర్డ్ జూనియర్ కాలేజ్ శనివారం ముందస్తు 2023 న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఉపాధ్యాయుల సమక్షం లో కేక్ కట్ చేసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బిఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ బెజవాడ నరేంద్ర బాబు, బాల భాస్కర రావు, ప్రిన్సిపాల్స్ అబ్బూరి వెంకటేశ్వర్లు, షాహుల్ హమీద్ పాల్గొన్నారు.



2న ఉపకార వేతనాల కోసం ర్యాలీ : ఆవాజ్

ప్రజాశక్తి-నెల్లూరు : మైనారిటీ విద్యార్థులకు స్కాలర్షిప్లను రద్దు చేస్తూ ఇటీవల తీసుకున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మైనారిటీ, ప్రజా సంఘాలను కలుపుకొని జనవరి 2వ తేదీన నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నామని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ తెలిపారు. శనివారం నగరంలోని డాక్టర్ రామచంద్ర రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీ హర్ష, ఆవాజ్ నగర్ కార్యదర్శి షేక్ రియాజ్, సీనియర్ నాయకులు షేక్ రియాజ్, నగర నాయకులు షేక్ సమీవుల్లా, డివైఎఫ్ఐ నగర నాయకులు జగదీష్ లు పాల్గొన్నారు.




నూతన సంవత్సర శుభాకాంక్షలు : ఎంపిపి

ప్రజాశక్తి -లింగసముద్రం : లింగసముద్రం మండల ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు మండల పరిషత్ అధ్యక్షులు పెన్నా కృష్ణయ్య నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అందరూ సంతోషంగా ఉండాలని, అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని అందరికి మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేకునాంపురంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని నేకునాంపురంలో సర్పంచ్ కొల్లూరి లక్ష్మమ్మ, గోవిందయ్య ఆధ్వర్యంలో శనివారం వీధుల వెంట బ్లీచింగ్ చల్లించారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా బ్లీచింగ్ చల్లించినట్లు సర్పంచ్ తెలిపారు. పారిశుధ్య కార్మికులతో గ్రామంతో పాటు, బిసి, ఎస్‌సి కాలనీలలో ప్రతి వీధిలోనూ చల్లించారు. వీధిలైట్లకు సైతం మరమ్మత్తులు చేయించారు. కార్యక్రమాన్ని వారు పర్యవేక్షించారు. ప్రజలు తమ ఇళ్ల ముందు మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.



మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి -గుడ్లూరు :కందుకూరులో చంద్రబాబు నాయుడు పర్యటనలో మతి చెందిన కందుకూరు మండలం, ఓగూరు గ్రామానికి చెందిన గడ్డం మధు కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి రూ.40000 అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మాజీ జెడ్‌పిటిసి,బిసి నాయకులు చింతల శ్రీనివాస్ అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంఎల్‌ఎ దివి శివరాం, ఏలూరు జిల్లా టిడిపి కార్యదర్శి సిరిబత్తుల కష్ణమోహన్ ఉన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేసి పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం ఎంతో కృషి చేస్తున్నారని 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషాద్రి వాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు శేషాద్రి వాసు చేతుల మీదుగా విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ 8వ తరగతి గదుల్లో చెప్పే పాఠాలను పిల్లలకు ఇంటికి వెళ్లాక కూడా పిల్లలు మరింత క్షుణ్ణంగా సులభంగా నేర్చుకోవడానికి సిబిఎస్ సిలబస్ ఆధారంగా ట్యాబ్‌లోని యాప్‌లో పాఠ్యాంశాలు రూపకల్పన చేశారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు శేషాద్రి వాసు మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధి కొరకు సమానత్వం తీసుకురావడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచనలు ఎంతో గానో దోహదపడుతుందని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ మల్లికార్జున, ఉపాధ్యాయులు పుల్లయ్య, విద్యార్థులు తదితరులున్నారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన పారంశెట్టి పద్మాకర్‌ను శనివారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ 37 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో పలు పాఠశాలల్లో ఎంతో నిబద్ధతతో, అంకితభావంతో పనిచేసి, ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి చుంచులూరు ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని వారి సేవలను ఘనంగా కొనియాడారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ విష్ణుకుమార్‌రెడ్డి, ఎంఆర్‌జి రాజేంద్రకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు మురళీకృష్ణ, అశోక్, రేవతి, రబ్బాని, మాధవరావు, సురేంద్ర, ఖాజా రసూల్, విద్యార్థులు, గ్రామస్తులు, తదితరులున్నారు.

మొక్కలు నాటిన డాక్టర్ శ్రీధర్



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని శ్రీధర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, సంయుక్త సేవా సంస్థ గౌరవ సభ్యులైన డాక్టర్ పి.శ్రీధర్ పుట్టిన రోజు సందర్భంగా శనివారం ముసునూరు గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, లోక్‌సత్తా మాలకొండారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్ సుధాకర్, ఐసిడిఎస్ ఉద్యోగి సాయి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా మాలకొండారెడ్డి మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ పి.శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటడం అభినందనీయమని తెలిపారు. మానవ మనుగడ కోసం మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతో ఉందని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించ డానికి కృషి చేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం సంయుక్త సేవా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర చేస్తున్న కృషి ఆదర్శంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.శ్రీధర్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఫ్లెక్సీల చించివేతపై ఫిర్యాదు



ప్రజాశక్తి-వరికుంటపాడు : ఉదయగిరి మాజీ ఎంపిపి చేజర్ల సుబ్బారెడ్డి ఫ్లెక్సీలను చించివేశారని ఆయన వర్గీయులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తక్షణమే పోలీసులు ఫ్లెక్సీలను చించిన వారిపై చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కోరారు. ఆయనవెంట ఉదయగిరి జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు, దుత్తలూరు మాజీ మండల కన్వీనర్ చేజర్ల భాస్కర్ రెడ్డి, వింజమూరు వైసిపి మాజీ మండల కన్వీనర్ మలిరెడ్డి విజయ్ కుమార్, ఉదయగిరి మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాసులు, చేజర్ల సుధాకర్ రెడ్డి, గణపం రమేష్, ఉప్పుటూరి హరి, రియాజ్, చేజర్ల సుబ్బారెడ్డి, యువసేన తదితరులున్నారు.

అందరికీ పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : డిసెంబర్‌లో ఎవరికైతే పింఛన్లు ఇచ్చారో.. జనవరిలోనూ వారందరికీ పెరిగిన పింఛన్లతో మొత్తం కలిపి పంపిణీ చేయాలని ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలియజేశారు. 1వ తేదీ నుంచి పింఛన్ల పంపిణీ చేయాలని అలాగే జనవరిలో మంజూరు చేసిన కొత్త పింఛన్లు దాదాపు 140 పింఛన్లు కూడా పంపిణీ చేయాలని కోరారు. అంతేకాకుండా పెన్షన్‌కు సంబంధించిన ముఖ్యమంత్రి లేఖ, పింఛన్ల పుస్తకాలు కూడా పంపిణీ చేయాలని, ఎటువంటి అపోహలకు తావు లేకుండా పంపిణీ చేయాలని సంక్షేమ సహాయకులను కోరారు.

వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి-ఉదయగిరి : తూర్పు రాయలసీమ వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉప్పల ప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో బిట్-1 సచివాలయ ఆవరణలో రైతు భరోసా కేంద్రంలో ఎంఎల్‌సి అభ్యర్థి ఉప్పల ప్రసాద్‌గౌడ్ సచివాలయ సిబ్బంది కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలే పేర్నాటి విజయానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ గదియాళ్ళి ఎద్దాని, ఉపసర్పంచ్ షేక్ ముత్తుజ హుస్సేన్, వార్డ్ మెంబర్ ఉప్పుటూరి శ్రీనివాసులు, వైసిపి నాయకులు రియాజ్ పెంచలయ్య, సుందర బాబు, వాలంటీర్లు పాల్గొన్నారు.

'విట్స్'లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - కావలి : స్థానిక విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సంబరాలలో "చిన్మయమిషన్" నిర్వాహకులు కూడా పాలుపంచు కున్నారు. కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అనేక సాంస్కృతిక పోటీలలో ఎంతో ఉత్సాహంగా తమ ప్రతిభను చూపించారు. ఈపోటీలలో "రంగోలి" ఎంతో మనోహరమైనదిగా చెప్పుకుంటారు. ఈ ముగ్గుల పోటీలలో వందకు పైగా గ్రూపులు పాల్గొన్నాయి. ఈ పోటీలలో మొదటి మూడుస్థానాలలో నిలిచిన గ్రూపులకు చిన్మయమిషన్ వారు బహుమతులు ఇవ్వడమేగాక, పాల్గొన్న ప్రతి గ్రూపునకు కూడా కన్సొలేషన్ బహుమతులను అందజేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంక్రాంతి పొంగలి వండి పంపిణీ చేశారు. ఒకరికొకరు హ్యాపీ న్యూ ఇయర్, సంక్రాంతి పండుగల శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సంబరాలలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాలలో పాలు పంచుకున్న చిన్మయమిషన్ వారిని అభినందించారు.

'రాగూర్'లో రంగవల్లుల పోటీలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేటలోని రాగూర్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి రంగవల్లుల పోటీలను శనివారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.దొరస్వామి రెడ్డి, కరస్పాండెంట్ సిహెచ్ వి రమణ రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఈ రంగవల్లుల పోటీలను నిర్వహించారు. ఈ రంగవల్లుల పోటీలలో నాలుగవ తరగతి నుంచి పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులు పాల్గొన్నారు. మొత్తం 80 మంది విద్యార్థులు రంగవల్లులను పాఠశాల ఆవరణలో తీర్చిదిద్దారు. ప్రతి విద్యార్థి తమ నైపుణ్యాన్ని చక్కగా భారతీయ సంస్కృతి సాంప్రదాయాన్ని ఉట్టిపడే విధంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం ఐదు మంది జడ్జీల ద్వారా రంగవల్లులను పూర్తిస్థాయిలో పరిశీలించి రిజల్ట్ అనౌన్స్ చేశారు. మొదటి బహుమతి బి.వర్షిక, రెండవ బహుమతి ఓ శ్రీజ, మూడవ బహుమతి ఎ హర్షిత కైవసం చేసుకున్నారు. 80మంది విద్యార్థులలో 15 మంది ముస్లిం విద్యార్థినులు పాల్గొని రంగవల్లులను వేశారు. వారిలో ఎస్.కె నౌషిన్ అనే విద్యార్థినికి ప్రత్యేక బహుమతిని అందజేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఎస్‌పేట కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ రామకృష్ణ, మేనేజర్ శివకృష్ణ విచ్చేసి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను మర్చిపోకుండా రంగవల్లుల పోటీలను నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి



ప్రజాశక్తి-అల్లూరు : ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు చిల్లర రాజకీయాలు మానుకోవాలని నార్త్ ఆములూరు సర్పంచ్ షేక్.కరిముల్లా షా ఖాదర్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ప్రాతికేయుల సమావేశం నిర్వహించి తెలుగుదేశం పార్టీ అధినేతపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డిని రౌడీ ఎంఎల్ఏగా సంబోధించడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి సైకో అంటూ మతిస్తిమితం లేకుండా వృద్ధ చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం అర్థరహితమన్నారు. ఏ ప్రభుత్వం చేయలేని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందుతున్న తమ నాయకుడిపై అభాండాలు వేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ రాష్ట్రంలో చంద్రబాబుని ఎవరూ విశ్వసించరని జోస్యం చెప్పారు.

22వ డివిజన్లో సిపిఎం కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ నియోజకవర్గం నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ అనకుంటలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఐ (ఎం) కార్యాలయాన్ని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్ ప్రారంభించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు పార్టీ జెండాను ఆవిష్కరించారు. సిపిఎం ఉద్యమ నిర్మాత కామ్రేడ్ జక్కా వెంకయ్య చిత్రపటానికి రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం సిపిఎం శాఖ కార్యదర్శి దండి నారాయణ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్ మాట్లాడుతూ ఈ అనుకుంట ప్రాంతంలో సిపిఎం కార్యాలయం అనేకమంది సహకారంతో ఏర్పాటు చేసుకోవడం సంతోషదాయకమైందన్నారు. ఈ కార్యాలయం పరిసరా ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉపయోగపడు తుందని తెలియజేశారు. కేంద్రంలోని బిజెపి అధికారానికి వచ్చి 8 సంవత్సరాలవుతుందన్నారు. ఎన్నికల ముందు వందరోజుల ధరలు తగ్గిస్తామని ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, అవినీతిని రూపుమాపుతామని, అనేక వాగ్దానాలు చేసి బిజెపి అధికారులకు వచ్చిందన్నారు. అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యావసర ధరలన్నీ పెంచి మోడీ గవర్నమెంట్ మోసం చేసిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టుతున్నారన్నారు. రైల్వేలు, విమానాశ్రయాలు ఓడ రేవులు, పోర్టులు, బొగ్గు గనులు, ఎల్ఐసి ,పోస్టులు, చివరికి బ్యాంకులను కూడా కేంద్ర బిజెపి ప్రభుత్వం అంబానీ, ఆదోని లాంటి కార్పొరేటర్ దిగ్గజాలకు అప్పనంగా అప్పజెప్పడం ప్రయివేటుపరం చేయడం జరిగిందని తెలిపారు.ప్రజా వ్యతిరేకమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వారికి మద్దతిస్తున్న ప్రాంతీయ పార్టీలను ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కామ్రేడ్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ ఆర్‌డిఒ ఆఫీస్ అనుకుంట ప్రాంతాల్లో గత 16యేళ్ల కిందట ఇల్లు లేని చేనేత కార్మికులకు ఇల్లు ఇవ్వాలన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం చేసి ఇల్లు వేయించడం జరిగిందని తెలిపారు. సమస్యలన్నింటిపై సిపిఎం కార్యాలయాన్ని ఉపయోగపెట్టుకొని ప్రజలందరూ పోరా టం చేసి వారి సమస్యలు పరిష్కరించు కోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కామ్రేడ్ బత్తల కష్ణయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పేదవారందరికీ సిపిఎం కార్యాలయం ఉపయోగపడుతుందన్నారు. ఏ సమస్య వచ్చినా ప్రజలందరూ ఈ కార్యాలయానికి వచ్చి కూర్చొని మాట్లాడుకోవచ్చని తెలియజేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్, జి నాగేశ్వరావు, ఎస్కే మస్తాన్‌బీ, కొండ ప్రసాద్, పి సూర్యనారాయణ, ఎస్‌ఎం భాషా పాల్గొని మాట్లాడారు.



సిపిఎం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కార్యదర్శి మూలం రమేష్

రూ.15లక్షల చెక్కు అందజేత



ప్రజాశక్తి-సీతారామపురం : కందుకూరులో మూడు రోజుల కిందట జరిగిన చంద్రబాబు బహిరంగ సభలో ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు తన వంతుగా శనివారం టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కలిసి రూ.15 లక్షల చెక్కును ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్ అందించారు. తెలుగుదేశం పార్టీ ఒక కుటుంబమని ఆ కుటుంబంలో ఇటువంటి కష్టాలను ఎదుర్కొనేందుకు తన వంతుగా తోడుగా ఉంటానని ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఈ నగదును టిడిపి కార్యకర్తల సంక్షేమ నిధిలో జమచేసి, తద్వారా బాధితులను ఆదుకోవాలని ఆయన చంద్రబాబును విజ్ఞప్తి చేశానన్నారు. జిల్లాలో పార్టీ టిడిపి అధినేత పర్యటన విజయవంతమైనదని ఈ నేపథ్యంలో టిడిపి కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు.

పింఛన్ల రద్దు విరమించుకోవాలి : సిపిఎం



ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

వివిధ కారణాలతో ఇప్పటివరకు వస్తున్న సామాజిక పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన వారందరికీ పింఛన్లు ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో పింఛన్లు రద్దుపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ ప్రభుత్వం పింఛన్ దారులకు అర్హులని వారందరికీ పింఛన్లు మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.27 50 పింఛ న్లు పెంచుతున్నట్లుగా ప్రకటించి ఆ భారాన్ని తగ్గించుకునేందుకు వివిధ కారణాలతో పింఛన్లను కోత కోయడం దుర్మార్గమన్నారు. సంవత్సరంలో ఎప్పు డు ఒక నెలలో 300 యూనిట్లు విద్యుత్ వాడారని, గృహ నిర్మాణాలు 1000 చదరపు అడుగుల కన్నా ఎక్కువ ఉన్నాయని, లేని పొలం ఉన్నట్టుగా చూపిస్తూ కొద్దిమందికి, రూపాయి ఆదాయం లేని వారికి కూడా ఆదాయం పన్నులు కడుతున్నట్లు రకరకాల కారణాలు చూపించి పింఛన్లను తగ్గించడాన్ని విరమించుకోవాలని లేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకొని ఆందోళన తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరిం చారు. అనంతరం ఎంపిడిఒ నరసింహా రావుకి వినతి పత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తంబి రమణయ్య, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి గరికపాటి సురేష్, సిఐటియు మండల కార్యదర్శి మల్లికార్జున, నాయకులు ఖాదర్ బాషా, వెంకోజి, జానీ బాషా, బాలు కోటయ్య, దత్తశ్రీ కోటయ్య, ఆర్ మాల్యాద్రి, ప్రభాకర్ తదితరులున్నారు.

మెరుగైన వసతులు కల్పించాలి



ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్

ఆత్మకూరులో నూతనంగా నిర్మాణం చేపడుతున్న మున్సిపల్ బస్టాండ్ వద్ద షాప్‌లు సంఖ్య తగ్గించి ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, కౌలు రైతు సంఘం నాయకులు గంటా లక్ష్మీపతి పేర్కొన్నారు. శనివారం వారు సిపిఎం నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్టాండ్ ప్రాంగణంలో ప్రజలకు, వాహనదారులకు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రణాళికా బద్ధంగా విస్తరణ నిర్మాణం చేయించాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. అలాగే ప్రయాణికుల వసతి గృహం నిర్మాణానికి సంబంధించిన కేటాయింపులు బిల్డింగు, ప్లాన్ ఆత్మకూరు కౌన్సిల్‌లో తీర్మానం జరిగిందా.. లేదా.. ఎంజిఆర్ ఫౌండేషన్‌కు మున్సిపాలిటీకి మధ్య ఏ ప్రతిపాదన ఒప్పందం జరిగిందో ప్రజలకు వివరించాలని సిపిఎం పట్టణ కమిటీ సందర్భంగా కోరినట్లు తెలిపారు. సమస్యలను వెంటనే పరిశీలించి ఆత్మకూరు ప్రజలకు నియోజకవర్గ ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా ప్రయాణికుల వసతి గృహం నిర్మాణాలు చేపట్టవలసిందిగా కోరామన్నారు. అలా చేయని పక్షంలో ప్రజల పక్షాన సిపిఎం తరపున ఆందోళనకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులు కృష్ణమోహన్, ఆవాజ్ మండల ప్రధాన కార్యదర్శి పి.యస్థానిబాషా, రమణయ్య తదితరులున్నారు.


జనసేన నాయకుల సందడి

ప్రజాశక్తి-కావలి : ఖుషి మూవీ రిలీజ్ సందర్భంగా శనివారం మానస థియేటర్ వద్ద కావలి టౌన్ పవన్ కళ్యాణ్ అధ్యక్షుడు ఆలా శ్రీనాథ్ ఆధ్వర్యంలో నాయకులు సందడి చేశారు. హాల్ దగ్గర అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ చేసుకొని ఈ మూవీ రిలీజ్‌ను న్యూ ఇయర్ సెలబ్రేషన్‌లా చేసుకున్నారు. పెద్ద ఎత్తున జనసేన అభిమానులు పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అందరూ పాల్గొని విజయవంతం చేశారు. జనసేన టౌన్ ప్రెసిడెంట్ పబ్బా సాయి విటల్, రూరల్ అధ్యక్షుడు వెంకయ్య, అల్లూరు మండలం అధ్యక్షుడు కార్తీక్ శర్మ, అజయ్ ఉన్నారు.

చంద్రబాబు పర్యటన విజయవంతం

ప్రజాశక్తి-కోవూరు

మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోవూరు పర్యటనను విజయవంతం చేసిన కోవూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులకు ప్రజలకు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ పోలంరెడ్డి దినేష్ రెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు తెలుగుదేశం నాయకులకు ప్రజలకు ఎంతో ఉత్సాహం కలిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ప్రజలు, నాయకులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వైసీపీ నాయకులు అరాచ కాలకు అవినీతికి పాల్పడుతున్నారని, మాఫియాకి అడ్డాగా మారిందని పోలీస్ వ్యవస్థ వైసిపి నాయకులకి తొత్తులుగా పని చేస్తున్నారన్నారు. చంద్రబాబు పర్యటనను అడుగడుగున పోలీసులు అడ్డుకున్న గాని ప్రజలను ఎవరు కూడా చంద్రబాబు పర్యటనను ఆపలేక ప్రజల సునామీలో పోలీసులు చిక్కుకుపోయారన్నారు. చంద్రబాబు నాయుడు సభ విజయవంతం చేసినందుకు ప్రజలందరికీ పేరు పేరునా కతజ్ఞతలు తెలుపుతూ పాత సంవత్సరంలో జరిగిన అవాంఛనాలన్నీ తొలగిపోతూ కొత్త సంవత్సరంలో తెలుగు దేశ ప్రభుత్వం నాయకులు కార్యకర్తలతో మమేకమై కొత్త సంవత్సరంలో అడుగుపెట్టి రాబోయే ఎన్నికలలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, కోటంరెడ్డి అమరేంద్ర రెడ్డి, వీరేంద్ర, చెముకుల చైతన్య, నాటక రాణి వెంకట్, బాల రవి, వేగూరు సుబ్బానాయుడు, జెట్టి రాజగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఏ పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

చంద్రబాబుకు చెంచలబాబు శుభాకాంక్షలు



ప్రజాశక్తి-ఉదయగిరి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శనివారం జిల్లాలోని కోవూరు నియోజకవర్గం రాజుపాలెంలో ఆయనను మర్యాదపూర్వక కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అడ్వాన్స్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారన్నారు. ప్రతిఒక్కరూ ఐక్యతతో పాల్గొని చేపట్టి కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యకర్తలకు అండగా ఉండి వారికి భరోసా కనిపించాలన్నారు. పార్టీ గెలుపునకు జిల్లాలో విజయ కేతాలు వినిపిస్తున్నాయని రానున్న రోజుల్లో పార్టీ కార్యకర్తలకు ప్రజలకు మంచి జరుగుతుందని తెలిపారన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని చాబోలు ఎస్‌సి కాలనీలో విద్యుత్ షాక్‌తో కామగాళ్ల సువార్తమ్మ (30)అనే మహిళ శుక్రవారం రాత్రి మృతి చెందింది. వివరాల మేరకు... మృతురాలు తమ నివాసగృహంలో స్విచ్ బోర్డులో ఫ్యాన్ తీగలు పెట్టి ఇనుప మంచంకాలు కింద ఉన్న తీగను గమనించక కూర్చోవడంతో వైరు కట్ అయినది. వెంటనే ఇనుప మంచానికి విద్యుత్ సరఫరా కావడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెకు ముగ్గురు చిన్న పిల్లలున్నారు. పోలీసులకు సమాచారం తెలియడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉదయగిరికి తరలించారు.

వింతవ్యాధితో మూగజీవాలు మృతి

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలవ్యాప్తంగా మూగ జీవాలు వింత వ్యాధితో మృత్యువాత పడుతుండడంతో పశుపోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆవులలో ఒంటి మీద దద్దుర్లు వచ్చి వేగంగా వ్యాప్తి చెంది చుట్టుపక్కల ప్రాంతాల్లో చాలా ఆవులు చనిపోతున్నా యని యజమానులు చెబుతున్నా రు. వ్యాధి సోకిన దూడలు మృతి చెందుతున్నాయి. ఇలా పశువులు దూడలు చనిపోవడం వల్ల రైతులు, పశుపోషకులు ఆర్థికంగా చితికి పోతున్నారు. రాజుపాలెంలో దాదాపు నెల రోజులనుండి 10ఆవులు మృతి చెందాయి. మరికొన్ని ఆవులు కొనఊపిరితో కొట్టుమిట్టాడుతు న్నాయి. పశువైద్యసిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోక పోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని లింగంనేనిపల్లి గ్రామానికి చెందిన మద్దిశెట్టి వెంకటేశ్వర్లు అరెస్టు చేసినట్లు సెబ్ అధికారి రవీంద్రబాబు తెలిపారు. వివరాలు మేరకు.. శనివారం మర్రిపాడు మండలం కృష్ణాపురం బ్రాందీ షాపు నుంచి 9 ఫుల్ మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పట్టుకున్నామని ఆయన తెలిపారు. అత్యధిక మద్యం కలిగి ఉండటంతో అతని బైక్‌ను సీజ్ చేయడంతో పాటు అతనికి మద్యం విక్రయించిన షాప్ సేల్స్‌మెన్ మంచాల వెంకటాద్రిని అరెస్ట్ చేశామన్నారు.

పింఛన్ల రద్దుపై లబ్ధిదారుల ఆగ్రహం

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం కుంటిసాకులు చూపిస్తూ సామాజిక పింఛన్లు రద్దు చేస్తూ లబ్ధిదారులకు కార్పొరేషన్ అధికారులు నోటీసులు అందజేయడంతో ప్రజల్లో వైసిపి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత నెలకొంటుంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్తు సంస్కరణల పేరుతో ఛార్జీలు పెంపుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వినియోగదారులపై ఆర్థిక భారం పడింది. ఈ తరుణంలో పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులకు కరెంటు బిల్లులు ఎక్కువ మొత్తంలో నమోదు అవుతున్నాయనే నెపంతో ఫించన్లు రద్దు చేస్తున్నట్లు నోటీసులు అందజేసింది. అంతే కాకుండా లబ్ధిదారుల పేరుతో భూములున్నాయని, నివాస స్థలాలు ఉన్నాయని అందువల్ల ఫించన్లు అందుకునేందుకు అర్హత కోల్పోయారంటూ మరి కొంత మందికి కార్పొరేషన్ అధికారులు నోటీసులు అందజేశారు. అధికారులు అందజేసిన నోటీసుల్లో పేర్కొన విధంగా లబ్ధిదారులకు ఏయే ప్రాంతాల్లో భూములు, నివాస స్థలాలు ఉన్నాయో చూపిస్తే ఆనందంగా జీవిస్తామని, తమకు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లు స్వచ్ఛందంగా తిరిగి ప్రభుత్వానికి అందజేస్తామంటూ లబ్ధిదారులు నగరంలో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు సైతం వ్యతిరేకిస్తున్నారు. కార్పొరేషన్‌లో చెత్త తరలించేందుకు వినియోగిస్తున్న వాహనాల డ్రైవర్లు తమకు ప్రభుత్వం వేతన బకాయి ఉందని, వెంటనే చెల్లించాలంటూ గడిచిన మూడు రోజు నుంచి విధులను బహిష్కరించి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఒక్కొక్క డ్రైవర్‌కు వేతనంగా రూ.18,500లు కాంట్రాక్టర్ తీసుకుంటూ తమకు మాత్రం రూ.8,250లు అందజేస్తున్నారని, అది కూడా గడిచిన నాలుగు నెలల వేతన బకాయి ఉందని, వెంటనే చెల్లించాలంటూ డ్రైవర్లు ఆందోళనచేపడుతున్నారు. కార్మికుల ఆందోళనకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సంపూర్ణ మద్దతును ఇచ్చింది. మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు జిల్లా పర్యటన విజయవంతం అయిందని చెప్పవచ్చు. కందుకూరులో చంద్రబాబు పర్యటన సందర్భంగా చోటు చేసుకున్న దుర్ఘటన పార్టీ శ్రేణుల్లో విషాదం నెలకొంది. టిడిపి సభలకు హాజరైన ప్రజలను చూస్తే జిల్లాలో తెలుగుదేశం పార్టీకి గత వైభవం వచ్చిందని చెప్పకనే చెప్పవచ్చు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజల్లో, ప్రభుత్వ ఉద్యోగుల్లో తీవ్ర స్థాయిలో వెతిరేకత నెలకొంది.ఇదిలా ఉంటే వైసిపిలో వర్గ విభేదాలు ఒక్క సారిగా బయటపడ్డాయి. మాండూస్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందంటూ ఏపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జనవరి 2వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని రైతులందరూ భారీ స్థాయిలో హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చాయి. మైనార్టీలను విద్యకు దూరం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నాయని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని, ఈ సమస్యలను ప్రారంభదశలోనే ఎదుర్కొవాలంటూ ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో జనవరి 2వ తేదీన భారీ స్థాయిలో నగరంలో నిరసన ప్రదర్శనలు చేపట్టేందుకు పిలుపునిచ్చింది.

వీక్షణం

అధ్వానంగా మైపాడు రోడ్డు..

- అవస్థల్లో వాహనచోదకులు - నిద్రావస్థలో అధికారులు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మైపాడు రోడ్డులో వెళ్లాలంటే పగటి పూటే చుక్కలు కనిపిస్తున్నాయి. మైపాడు నుంచి నెల్లూరుకి వాహనదారులు తప్పని పరిస్థితుల్లో తప్ప వాహనాల్లో ప్రయాణించాలంటే బెంబేలెత్తి పోతున్నారు. గమ్యం చేరేవరకు వాహనా దారులు ప్రాణాలు అరచేతులు పట్టుకుని వెళ్తున్నారు. ఎప్పుడు టైర్లు పంచరవుతాయో తెలియక, ఈ వర్షానికి ఏ గుంటలు ఎంత లోతు ఉంటాయో తెలియక నరకయాతనగా వాహన ప్రయాణం చేస్తున్నారు. ఇందుకూరుపేట మండలంలోని పలు రహదారుల్లో ప్రయాణించాలంటే వాహనదారులకు ప్రాణ సంఘటమంగా మారింది. మండలంలోని మైపాడు నుండి నెల్లూరు వెళ్లే రహదారి, కొరుటూరు,సోమరజుపల్లి,పల్లిపాడు,కుడితిపాలెం రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీనికి తోడు వర్షపు నీరు తోడవడంతో మరింత అధ్వానంగా మారాయి. మండలంలోని రహదారులు ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నాయి. ముఖ్యంగా సుదూర ప్రాంతాల నుండి యాత్రికులు మైపాడుకు వస్తుంటారు. రోడ్లు ఇలా ఉండడంతో బెంబేలెత్తిపోయిన యాత్రికులు పక్కనే ఉన్న కోడూరు బీచ్‌కు వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. దాని ద్వారా చిరు వ్యాపారస్తులు ఆదాయం తగ్గిపోయిందని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని రోడ్ల దుస్థితిని మెరుగుపరచాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

రోడ్లు బాగు చేయండి..

రావెళ్ల వీరేంద్ర చౌదరి టిడిపి మండల అధ్యక్షులు



గత మా ప్రభుత్వంలో మండలంలోని పలు రోడ్లకు నిధులు శాంక్షన్ చేయడం జరిగింది. ప్రభుత్వం మారడంతో ఆ నిధులను నిలిపివేశారు. కొరుటూరు నుండి మైపాడు కి వెళ్లాలంటే ప్రయాణం ప్రజలకు నరకయాతనంగా ఉంది. ఇకనైనా ఈ ప్రభుత్వం మేల్కొని అభివద్ధివైపు దష్టి సారించాలని కోరుకుంటున్నాను.



వర్షాలకు రోడ్డుపై గుంతలు కనబడక ఇబ్బందిగా వెళుతున్న వాహనాదారులు (ఫైల్)

గుడి హరి కుమార్ రెడ్డి

ఇందుకూరుపేట జనసేన మండల కన్వీనర్

నెల్లూరు నుండి మైపాడుకు నిత్యం వందలాది మంది యాత్రికులు వస్తుంటారు. అలాగే వ్యాపారీత్య చుట్టుపక్కల గ్రామాలను నెల్లూరుకు వెళ్తుంటారు. ఇది అన్ని రకాల వాహనదారులకు ప్రయాణాలకు ఇబ్బందికరంగా ఉంది. ఈ సమస్యను ప్రభుత్వ వారు చొరవ తీసుకొని నూతన రోడ్లను వేయాలని కోరారు.

వాహనదారుల ఇక్కట్లు

రాజా ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి



ముఖ్యంగా మైపాడు నుండి నెల్లూరు వెళ్లేందుకు ఆటో కార్మికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా వర్షా కాలమైతే ఆటో ఎక్కడ ఏ రిపేర్లు వస్తా వస్తాయో తెలియక ఆటో కార్మికులు బిక్కుబిక్కుమంటున్నారు. సంపాదించే దాంట్లో సగం ఆటో రిపేర్లకి సరిపోతుంది. ఇకనైనా ప్రభుత్వం వారు నిద్ర మేల్కొని రోడ్లు వేసి ఆటో కార్మికుల అభివద్ధికి తోడ్పడాలని కోరుకుంటున్నాను.

ప్రత్యేక పూజలు



ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లిలో వెలసిఉన్న శ్రీ పంచముఖ శక్తి గణపతి దేవాలయాన్ని మండల ప్రత్యేకాధికారి, ఆత్మకూరు గృహనిర్మాణ శాఖ డిఇ నటరాజన్ సందర్శించారు. అనంతరం స్వామి వారికి దూప దీప నైవేద్యాలతో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి స్వామి వారి తీర్థ ప్రసాధాలు అందజేసి ఆశీర్వదించారు.